# మనసు గతి

కె. వరలక్ష్మి



నర్సింగ్ హోం నుంచి బైటికొచ్చి ఆటోలో ఎలా ఎక్కానో నాకే తెలీదు. ఆకాశంలో సూర్యబింబం లాగేనా మనసూ చండ ప్రచండంగా మండిపోతోంది.

ఎంత పని జరిగింది! ఏదైతే కాకూడదనుకున్నానో అదే జరిగింది. గత మూడేళ్లుగా ఏమీ కానిది ఇప్పుడెలా సంభవించిందో అర్థం కావడం లేదు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది.

సుకుమార్ మీద నాకు విపరీతంగా కోపం వచ్చింది. ఆటో దిగి లోపలి కడుగుపెడుతూనే "హాయ్ యార్, ఏంటిలా వేళకాని వేళలో ..." అంటున్న అతని కాలర్ పట్టుకున్నాను "నీ కసలు బుద్ధుందా?" అని అరిచాను.

"కూల్‌డౌన్ కూల్ డౌన్, అసలేం జరిగిందో చెప్పు ముందు" నన్ను కూర్చోబెడుతూ అన్నాడతను.

ఆవేశంతో నాకు నోట మాట రావడం లేదు. కసితీరా అతని చెంపలు పగలగొట్టాలనిపిస్తోంది.

"నువ్వు కోపంలో కూడా చాలా అందంగా వుంటావనేమాట నిజమే కాని, మరీ ఇంత కోపం తెచ్చుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. అసలేం జరిగిందో చెప్పమంటున్నానా!"

"ఏం జరుగుతుంది నువ్వు చేసిన నిర్వాకానికి? నువ్వు పాడుతున్నావుగా పాటొకటి, అదే జరిగింది."

"అరె, ఇలా సింబాలిక్ లాంగ్వేజ్‌లో చెప్తే ఎలారా, నాకేమైనా అర్థం కావాలా వద్దా?"

నేను కళ్లెత్తి కొరకొరా చూసాను. ఎందుకైనా మంచిదని కాబోలు రెండడుగులు వెనక్కివేసి నిలబడ్డాడు 'ద మోస్ట్ ఒబీడియంట్'లా చేతులు కట్టుకుని.

"డాక్టర్ వీణ దగ్గరికి వెళ్లొచ్చానిప్పుడే, ప్రెగ్నెన్సీ... కన్ఫం చేసింది" నేనూహించని రీతిలో రియాక్టయ్యాడతను. ఒక్కసారిగా నన్నెత్తుకుని పైకి లేపేసాడు. చిన్న పిల్లాడిలా గదంతా గింగిరాలు తిరిగి తిరిగి, అతి జాగ్రత్తగా నన్ను మంచంమీద దించి "అమ్మా, నీకో గుడ్ న్యూస్" అంటూ అరిచాడు.

వంట గదిలో నుంచి కొంగుకు చేతులు తుడుచుకుంటూ వచ్చిన మా అత్తగారి ముఖం వెలిగిపోతోంది.

ఇదంతా చూస్తూంటే... ఈ తల్లీ కొడుకూ ముందే ఇలా జరగాలని కోరుకున్నారన్న మాట!

ఆవిడ గబగబా వెళ్ళి గుప్పెడు పంచదార తెచ్చి కొడుకు నోట్లోనూ, నా నోట్లోనూ వంపింది. నాకు మాత్రం అది పంచదారలా లేదు, వేపగుండలా ఉంది. సుకుమార్ ముఖం చూస్తూంటే నాకు ఒంటికి కారం అద్దుకున్నట్లుంది. ఏదో ఘనకార్యం చేసినవాడిలా ఎలా పొంగిపోతున్నాడో చూడు!

తల్లీ కొడుకూ ఎంత బతిమలాడినా వినకుండా అక్కర్లేదని ముసుగుపెట్టి పడుకున్నాను.

పిల్లలు పుట్టకుండా జాగ్రత్తలన్నీ తను తీసుకుంటానని నమ్మించి ఎంత మోసం చేసాడు సుక్కు!

పెద్ద పొట్ట మోసుకుంటూ, చిత్రంగా నడుస్తూ గర్భంతో ఉన్న ఆడవాళ్లు ఎంత అసహ్యంగా కన్పిస్తారో నాకు తెలుసు. రేపొద్దున ఇతగాడే 'ఇదేంటి సుముఖా, నువ్వింత అందవిహీనంగా తయారయ్యావ్?' అంటాడు కాబోలు!

ఉన్నట్టుండి కడుపులో ఏదో జరజరా పాకిన అనుభూతి. చిన్న పాము పిల్లని చూసుకోకుండా మింగేసినంత జుగుప్సగానూ, భయంగానూ ఉంది.

ఉదయం ఆఫీస్‌లో చాలా బిజీ వర్క్‌లో ఉండగా ఇలాగే జరిగింది. ముందు ఏదోలే అని పట్టించుకోలేదు. వేడివేడి టీ తాగినప్పుడు మరింతగా ఆ కదలిక అనుభూతిలోకి రావడంతోనే నా బుర్ర పనిచెయ్యడం మానేసింది. అన్యమనస్కంగా ఆఫీసులో కూర్చున్నంత సేపూ తప్పుల తడకలు చేస్తూనే ఉన్నాను. ఇక యాంగ్జైటీని ఆపుకోలేక డాక్టర్ వీణని కలిసాను.

పదహారు వారాలు దాటిపోయాయి కాబట్టి ఇప్పుడిక ఎబార్షన్ కూడా వీలుకాదంది.

మొదట్నుంచీ నావి రెగ్యులర్ పీరియడ్స్ కాకపోవడంతో వచ్చింది చిక్కంతా. కొంచెం కూడా అనుమానం కలగలేదు. ఈ మధ్య ఒళ్లు చేస్తున్నాననీ, రంగొస్తున్నాననీ నా కొలీగ్స్ అంటూండడంతో వెయిట్ చూసుకుని ఎక్సర్‌సైజులు మొదలుపెట్టాను. నెలతప్పగానే ఏవో సింప్టమ్స్ కన్పిస్తాయంటారుకదా, వామిటింగ్ సెన్సేషన్, పులుపు తినాలన్పించడం వగైరా, అలాంటివి ఏమీ అన్పించలేదు. పెళ్లైన ఈ మూడేళ్లుగా ఏమీ కాలేదనే ధీమా కొంత నేను ఏమారడానికి కారణమైంది. అన్నీ కలిసి ఇలా మోసం చేసాయి.

"నీకూ నాకూ మధ్యాహ్నానికి లీవ్ ఫోన్లో చెప్పేసి

### జోలపాట

ఆపరేషన్‌తో బయటపడ్డ
పిల్లాడు ఏడ్చాడు 'క్యా-క్యా' అంటూ-
రేషన్ కార్డుతో జోకొడుతోంది తల్లి
'క్యూ-క్యూ' అంటూ!

-చిమ్మపూడి శ్రీరామమూర్తి

వచ్చాను" అంటూ వచ్చాడు సుక్కు. "నువ్వింక జాబ్‌కి రిజైన్ చేసెయ్యడం మంచిదనుకుంటాను బేబీ" అన్నాడు నా ముఖం మీది దుప్పటిని తొలగిస్తూ. "ఇంకా అలకపోనట్టుందే దేవిగారికి, ఎక్కడైనా అమ్మ అవ్వాలని తపించి పోయే వాళ్లుంటారు. కానీ, ఇలా కొంపేదో మునిగిపోయినట్టు తల్లడిల్లి పోయేదాన్ని నిన్నే చూస్తున్నాను" కొంత నిష్ఠురంగా అన్నాడు సుక్కు.

"సుక్కూ, నాకు పిల్లలంటే అసహ్యమని నీకు పెళ్లైన మర్నాడే చెప్పేను. మా అత్తయ్య పిల్లలు ముగ్గురూ ఆమెని వేధించుకు తిన్న విధానం కళ్లారా చూసేను కాబట్టి.."

"ఫర్ యువర్ క్రైండ్ ఇన్ఫర్మేషన్, మూడు వందల ఎనిమిదోసారనుకుంటాను నువ్విది చెప్పడం, ఇలాంటి విషయాలు పెళ్లికి ముందు చెప్పాలోయ్, పెళ్లైన మర్నాడు కాదు. మీ అత్తయ్య పిల్లలు రాక్షసులైతే అందరూ అలా ఉండాలని రూలేమైనా ఉందా? ఎవరో ఎందుకు, ఉదాహరణకి నువ్వే చూడు మీ వాళ్ల గురించి హాస్యానికైనా మాట్లాడుకోనిస్తావా? అక్కడ మీ నాన్న ఒంటి మీద ఈగవాల్తే ఇక్కణ్నుంచి నీకది తేలులా కన్పిస్తుంది కదా!"

"మహాశయా, హెరిడిటీ అనే దొకటుంటుందని తెల్సా, నావన్నీ మా అత్తయ్య. పోలికలే.."

"అందుకని నీకు పుట్టబోయే పిల్లలవి మీ అత్తయ్య పిల్లల పోలిక లంటావా, హెరిడిటీ అంటే.. ఓహ్ ఏం నాలెడ్జ్ రా నాయనా"

మరుక్షణం అతని చేతిమీద పడినగాట్లు చూసుకుని కెవ్వుమని అరిచేడు సుక్కు. అతనింకా చేతి మీద ఉఫ్ ఉఫ్ అని ఊదుకుంటూండగానే అర లీటరు గ్లాసొకటి (ఇంట్లోకల్లా అదే పెద్దగ్లాసు) చేత్తో పట్టుకుని తొణక్కుండా జాగ్రత్తగా నడుస్తూ వచ్చిన మా అత్తగారు "లే అమ్మాయ్, చిక్కటి పాలల్లో హార్లిక్స్ కలిపేను, లేచి తాగు. అసలే ఉత్త మనిషివి కూడా కాదు, ఉపవాసం ఉండకూడదు" అన్నారు.


దీపావళి శుభాకాంక్షలు!

వివాహాది శుభకార్యములకు, విస్తృత వస్త్రశ్రేణి వస్త్రములు

బొమ్మన

లేడీస్ అండ్ జెంట్స్ క్లాత్ షోరూం A/C

విజయనగరం

రెడీమేడ్ ప్రత్యేక షోరూం కలదు.

'హ తోస్మి, మొదలైందిరా నాయనా, ఇక ఈవిడ నన్ను అడుగు కిందపెట్టనిచ్చేట్టు లేదు. తల్లీ కొడుకూ కల్సినా ఉద్యోగానికి నీళ్లొదిలించేలా ఉన్నారు' అనుకున్నాను.

ఆవిడెళ్లాక పొందిగ్గా నా పక్కనే సర్దుకుని "సుకూ, ముందు మనకి పాపపుడితే బావుంటుంది కదా, ఇంకా అయిదు నెల్లు సస్పెన్స్ భరించడం కష్టమోయ్, స్కానింగ్ ఎప్పుడు వీలవుతుందో కనుక్కుందామా " అన్నాడు సుక్కూ మురిసిపోతూ. "ఇలాంటి సమయంలో ఏవేవో తినాలని ఉంటుందట కదా, నీకేం కావాలో చెప్ప ఇప్పట్నుంచి అదేపన్లో ఉంటాను"

ఒళ్లు మండింది నాకు– "నువ్వు నోరు మూసుకోవడం కావాలి నాకు. ఆడవాళ్లన్నా వాళ్ల అభిప్రాయాలన్నా ఎంత చులకన మీ మగ రాస్కెల్సకి" అన్నాను రౌద్రంగా.

"ఆగాగు, మావ కూతురివి కాబట్టి తిడితే నన్నొక్కణ్ణే తిట్టు, మగ జాతినంతట్నీ తిట్టకు, కావాలంటే నాలుగు ముద్దులు పెడతాను" అన్నాడు సుక్కు.

"చూడు మిస్టర్ సుకుమార్! నేనేం జోక్సని ఎంజాయ్ చేసే మూడ్‌లో లేను, నాతో మాట్లాడకసలు" కసురుకున్నాను.

మర్నాడు ఉదయాన్నే లేచి నేను ఎక్సర్‌సైజ్ మొదలెట్టేసరికి మా అత్తగారు ఒక్కకేకపెట్టింది "ఇదెక్కడి చోద్యమే సుముఖా! నీళ్లోసుకున్న పిల్లవి, ఆ తాడుచ్చుకుని అలా గెంతితే ఇంకేమైనా ఉందా" అంటూ

'ఇలా గెంతితే ప్రమాదమన్నమాట! హమ్మయ్య మంచి ఉపాయం చెప్పేవత్తయ్యా' అనుకుని లోపల్లోపలే థేంక్స్ చెప్పకున్నాను. స్కిప్పింగ్ టైం మరో అరగంట పెంచేను. శీర్షాసనం ప్రాక్టీస్ చెయ్యాలని నిశ్చయించుకున్నాను.

ఇల్లంతా రకరకాల ఫ్రూట్స్‌తో నింపేసాడు సుక్కు. ఆ పళ్ల రసాలు తాగలేక నా ప్రాణం పోతోంది.

ఒకరోజు సుక్కు నా మీద మరీ ప్రేమ కురిపించేస్తున్నప్పుడు గోముగా అన్నాను "సుక్కూ! డాక్టర్ వీణ మరీ భయస్తురాలు. మరో గైనకాలజిస్ట్ ఎవర్నైనా కన్సల్ట్ చేద్దామా ఎబార్షన్‌కోసం"

"సుముఖా!" ఇల్లెగిరి పోయేలా ఒక్కకేక పెట్టాడు. అన్నంతపనీ చేస్తానేమోనని కళ్లనీళ్లు పెట్టుకుని ఒకటే ఇదై పోయాడు. నాకు భలే చిరాకేసింది. ఏడ్చే వాళ్లంటే అసహ్యం నాకు. ఊహ తెలిసాక ఒక్కసారికూడా ఏడ్వలేదు నేను.

కొన్నాళ్లు నాతో మాట్లాడ్డం మానేసాడు సుక్కూ.

మా అత్తగారైతే నన్ను అడుగుకింద పెట్టనివ్వడం లేదు. పుట్టి ఉద్ధరించబోయే మనవడో, మనవరాలో కోసం ఓపికపట్టి అన్ని పనులూ ఆవిడే చేసుకుపోతోంది. నా పని మహారాణి దర్జాలా ఉంది. క్రమంగా నా గర్భంలో శిశువు ఎదుగుదల ప్రారంభమైంది. నేనేమైనా తిన్నా, తాగినా లోపల ఆ చిన్న ప్రాణి కదిలి తన సంతోషాన్ని కాబోలు వ్యక్తం చేస్తోంది.


నా శరీరంతో బాటు మనస్సు కూడా ఏదో మార్పుకి లోనవుతోంది. ఒక్కొక్క సారి నాకు చిరాకేసేంతగా, నాకు తెలీకుండానే ఆ చిన్నిప్రాణిని ఇష్టపడుతున్నాను. ఒంటరిగా ఉన్నప్పుడు నా ఆలోచనలన్నీ దాని చుట్టూనే తిరుగుతున్నాయి. చిత్రంగా నాకు సుక్కూ ముఖ్య మన్పించడం లేదిప్పుడు. పైకి మాత్రం బింకం వదల్లేదు నేను.

ప్రెగ్నెన్సీతో ఆడవాళ్లు చూపులకి బావుండరనే కాంప్లెక్స్ వదలక జాబ్‌కి లాంగ్‌లీవ్ పెట్టేసాను. అత్తయ్యకి చిన్న చిన్న పన్లు సాయం చేస్తూ ఇంట్లోనే అటూ ఇటూ తిరుగుతున్నాను ఎక్సర్ సైజ్ కోసం. స్కిప్పింగ్ వగైరాలకి దుమ్మా కొట్టేసాను. పుట్టబోయే అపురూపమైన పాపాయి మీదే ఉంది నా దృష్టంతా. సస్పెన్సే బావుంటుందని స్కానింగ్ వద్దనుకున్నాం సుక్కూ నేనూ.

రోజు రాత్రి నిద్రపోయేముందు పాపాయి కదలికల్ని చూసుకుని పరవశించి పోతాడు సుక్కు.

అంతగా కదిలికలుంటే అది ఆడపిల్లే నన్నారు మా అత్తగారు. "కాదు, మగవెధవే అయ్యుంటాడు, అందుకే కాలూ చెయ్యి స్థిరంగా నిలవడం లేదు" అన్నాడు సుక్కూ.

ఒక రోజు పల్లెలో మా అన్నయ్య, స్కూటర్ మీంచి పడి చావు దెబ్బలు తగిలించుకున్నాడు. మేమున్న టౌనుకి తీసుకొచ్చి హాస్పిటల్లో చేర్చారు. సుక్కు ఆఫీస్‌కి ఫోనొచ్చిందట. ఆఘరాబాదరా ఇంటికొచ్చి నన్నూ అత్తయ్యనీ తీసుకెళ్లాడు. కంటి చూపు, నోటిమాట లేకుండా బెడ్ మీద పడివున్నాడు అన్నయ్య. అమ్మ, వదిన ఏడ్చి ఏడ్చికళ్లు వాచిపోయి ఉన్నారు. వెళ్తూనే అత్తమ్మ భోరుమంది. అమ్మా వాళ్లకి సాయంగా అత్తమ్మ అక్కడే ఉండిపోయింది.



ఇంటి కొస్తుంటే దార్లో సుక్కూ అడిగాడు "దెబ్బలు తగిలించుకున్న వాడు స్వయంగా నీ అన్నయ్య కదా, అలా రాయిలా చూసేవు తప్ప నీ కంటి వెంట నీటి చుక్కైనా వచ్చిందా?"

"ఏం చెయ్యను బావా, నాకు ఏడుపు రాదు మరి. లోపలేదో దుఃఖంలాంటి భావం కలుగుతుందేమోకాని ఏడుపు మాత్రం రాదు" అన్నాను.

"నువ్వు కఠిన శిలవే సుమా, అమ్మమ్మ పోయినప్పుడు కూడా ఏడవలేదు నువ్వు. రేపు నాకేమైనా ఐనా నువ్వింతే కదా, హ్హు.." అన్నాడు సుక్కూ నా భుజం చుట్టూ చెయ్యివేసి దగ్గరికి హత్తుకుంటూ.

"ఏడూ కొండలవాడా, ఎక్కాడున్నావయ్యా..." రేడియో హైపిచ్‌లో మార్మోగిపోతోంది. కళ్లు తెరిచి చిరాగ్గా చూసాను. "హమ్మయ్య, మెలుకువొచ్చిందా, ఎనిమిది కావస్తోందప్పడే. దేవిగారు లేచి ముఖం కడిగితే హార్లిక్స్ రెడీ" అన్నాడు సుక్కు రేడియో గొంతునొక్కి.

ఏడో నెల పూర్తి కావస్తున్నందున కాబోలు కొంత భారంగా ఉంటోంది. తొందరగా నిద్ర మెలకువ రావడం లేదు.

"సారీమేన్, అత్తయ్యకూడా ఇంట్లో లేదు కదా" అన్నాను లేచి బాత్ రూంవైపు నడుస్తూ. బోయిలర్ దగ్గర బకెట్లో వేడినీళ్లు నింపిఉన్నాయి. దాన్ని బాత్ రూంలో పెడితే సుక్కూ సంతోషిస్తాడనిపించింది. ఈ మధ్య అతని కోసం నేనేం చెయ్యడం లేదు. బలం అంతా ఉపయోగించి బకెట్ ఎత్తి బాత్‌రూంలో అడుగుపెట్టాను. అంతే, ఏమైందో తెలీకుండా కుడికాలు జారి, నిలదొక్కుకునే ప్రయత్నంలో బోర్లా పడిపోయాను. ఉధృతమైన నొప్పి కడుపులోంచి కనెప్పల మీదికి పాకడం మాత్రం గుర్తుంది నాకు.

హాస్పిటల్లో మెలకువరాగానే ఏం జరిగిందో కొంత సేపు అర్థం కాలేదు నాకు. ఏదో అనుమానం వచ్చి నా చెయ్యి నా గర్భం మీదికి పాకింది. మరుక్షణం అక్కడ వెలితి నా కర్థమైంది.

"మన...పాపేదీ?" భయపడుతూ భయపడుతూ సుక్కూని అడిగేను. సుక్కు నీళ్లు నిండిన కళ్లని కర్చీఫ్‌తో అద్దుకుంటూ "మనపాప మనకి దక్కలేదు సుమూ? అంతా మన.." ఇంకా ఏదో అనబోతున్న అతను బిత్తరపోయి ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు భోరుమని గుండె లవిసేలా కన్నీరు మున్నీరవుతున్న నన్ను.

నిజానికి దుఃఖం ఎందుకింతగా కట్టలు తెంచుకుందో నాకూ అర్థం కావడం లేదు.